
సాక్షి ఒడిశా
గురువారం । 19 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,96,435లు, బంగారం 20.55 గ్రాములు, వెండి 83.8 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



ముగిసిన మహోత్సవం

- 8లో

ఉత్సవాల్లో అపశృతి

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో గత 3 రోజులుగా జరుగుతున్న గెడ్డ వద్ద మంగళవారం రాత్రి తొక్కిసలాట చోటు చేసుకుంది. ఇందులో 10మందికి గాయాలయ్యాయి. అయితే పోలీసులు వెంటనే స్పందించి వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన ద్వారం లోపలి మార్గం వద్ద భారీగా జనం గుమిగూడి ఉండటంతో లోనికి అనుమతించకుండా అదుపు చేసి గాయాలైన వారిని ప్రభుత్వాస్పత్రికు తరలించారు.

న్యూస్‌రీల్

బ్లాక్ మార్కెట్‌లో హాకీ టిక్కెట్లు

- ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



హాకీ ప్రపంచకప్ టిక్కెట్లు

భువనేశ్వర్: రాష్ట్ర రాజధాని నగరంలోని కళింగ స్టేడియంలో జరగనున్న భారత్–వేల్స్ పూల్–ఈ ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్ మ్యాచ్ టిక్కెట్ల గిరాకీ విపరీతంగా పెరిగింది. మ్యాచ్ ప్రత్యక్షంగా తిలకించేందుకు క్రీడాభిమానులు ఎగబాకుతున్నారు. అయితే టికెట్ల బ్లాక్ మార్కెటింగ్ పుంజుకుంది. ఈ ముఠా ఆట కట్టించేందుకు పోలీసు యంత్రాంగం కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఐదుగురు నిందితులను సాహిద్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 19, 24,29 తేదీల్లో జరగనున్న మ్యాచ్‌ల టిక్కెట్లను అత్యధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ ముఠాలో ఇతర సభ్యుల ఆచూకీ కనుగొనేందుకు విచారిస్తున్నట్లు భువనేశ్వర్ డీసీపీ ప్రతీక్‌సింగ్ తెలిపారు. టికెట్ల అక్రమ అమ్మకాలు ఆరోపణ కింద అరెస్టు చేసిన నిందితుల్లో ఇంజినీరింగ్ విద్యార్థి ఉన్నట్లు పేర్కొన్నారు. మిగిలిన నలుగురు వ్యాపారవేత్తలు. సోషల్ మీడియాలో టికెట్ల బ్లాక్ మార్కెట్ చేస్తున్నట్లు వివరించారు. రూ.100 టిక్కెట్లను రూ.1000, రూ.200 టిక్కెట్లను రూ.2000, రూ.500 టిక్కెట్లను రూ.4 వేలకు విక్రయిస్తున్నారు. భువనేశ్వర్, రూర్కెలాలో జరుగుతున్న హాకీ ప్రపంచకప్‌తో ఏర్పడిన క్రేజ్, భారత జట్టు మ్యాచ్‌లకు టిక్కెట్ల డిమాండ్‌కు దారి తీసింది. పరిస్థితిని అనుకూలంగా మలుచుకుని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకునేందుకు బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్నారు.

ఎన్‌టీఆర్‌కు నివాళులు



ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సేవాసమితి సభ్యులు

బరంపురం: టాలీవుడ్ దిగ్గజ నటుడు నందమూరి తారకరామారావు(ఎన్‌టీఆర్) వర్ధంతి సందర్భంగా నగరంలోని బచ్చువారి వీధి ప్రాంగణంలో ఎన్‌టీఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ సేవాసమితి అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శి చక్రధరరావు, కోశాధికారి బి.సోమేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

సమ్మేటివ్-1 ఫలితాలు వెల్లడి

భువనేశ్వర్: రాష్ట్రానికి సంబంధించి 10వ తరగతి విద్యార్థుల సమ్మేటివ్-1 ఫలితాలు ప్రకటించారు. ఫలితాల పూర్తి వివరాలు బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. మొత్తం 5,32,746మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేయగా.. వీరిలో 13,058 మంది గైర్హాజరయ్యారు. కాపీయింగ్ చేస్తూ 143మంది పట్టుబడినట్లు బోర్డు స్పష్టం చేసింది. మెట్రిక్ వార్షిక పరీక్షలు ఈ ఏడాది మార్చి 10నుంచి ప్రారంభమై, 17వరకు కొనసాగుతాయి. 3,029 నోడల్ కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని బోర్డు ప్రకటించింది. పరీక్షల ప్రశ్నపత్రాల ఫార్మట్ యథాతథంగా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని బోర్డు అధ్యక్షుడు ఆదేశించారు.

సంస్కృతి పరిరక్షణ.. అందరి బాధ్యత



ఊరేగింపులో పాల్గొన్న జనం



ఆహ్వానం పలుకుతున్న ఉత్సవ స్వాగత ద్వారం

- రాష్ట్రమంత్రి జగన్నాథ సరక
- సందడిగా ప్రారంభమైన చొయితి ఉత్సవాలు
- ఆకట్టుకున్న గిరిజన సంప్రదాయ నృత్యాలు

రాయగడ: రాష్ట్రం భిన్న సంస్కృతులకు ప్రతీకగా నిలుస్తుందని, దీనిని పరిరక్షించడం అందరి కర్తవ్యమని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. జిల్లా కేంద్రంలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం నిర్వహించిన చొయితి ఉత్సవాలను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ భాష, సంస్కృతులకు అద్దం పట్టే ఉత్సవాల్లో చొయితి ఒకటిగా నిలిచిందన్నారు. ఏటా ఈ ఉత్సవాలను మనం ఎంతో సంతోషంగా నిర్వహించుకుంటున్నామని, అయితే గత రెండేళ్లు కరోనా కారణంగా దూరమయ్యామని తెలిపారు. అయితే ఈసారి ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహించుకోవడం ఆనందకరమన్నారు. జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ మాట్లాడుతూ చొయితి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8 నుంచి 13 వరకు నిర్వహించిన చొయితి క్రీడోత్సవాలకు మంచి స్పందన లభించిందన్నారు. అందరి సహకారంతో క్రీడలను నిర్వహించగలిగామని పేర్కొన్నారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో జనం హాజరు కావడం విశేషమన్నారు. ఈ సందర్భంగా చొయితి సావనీర్‌ను మంత్రి సరక ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమంగో, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రవి నారాయణ త్రిపాఠి, బిజూ స్వాస్థ్య సమితి సలహాదారుడు సుధీర్ దాస్, ఒడిశా సాహిత్య అకాడమీ సభ్యులు హేమంతకుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భారీఎత్తున ఊరేగింపు..

చొయితి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. పట్టణ ప్రజల ఆరాధ్యదైవం మజ్జిగౌరి మందిరం నుంచి అధికారులు, నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి జ్యోతిని ఊరేగింపుగా తీసుకువచ్చారు. తహసీల్దార్ తపస్‌రౌత్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రవినారాయణ త్రిపాఠి అమ్మవారి జ్యోతిని తీసుకువచ్చి, గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగే ఉత్సవ వేదిక వద్ద నిలిపారు. దీంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా జరిగిన ఊరేగింపులో వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, భజన సంకీర్తనలతో ఊరేగింపు సాగింది. ట్రాన్స్ జెండార్ల నృత్యం అందరినీ ఆకర్షించింది. అదేవిధంగా రామ, లక్ష్మణ, రావణాసుర వేషధారణలు ప్రత్యేకంగా నిలిచాయి. మజ్జిగౌరి మందిరం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి, జీసీడీ ఉన్నత పాఠశాల వరకు ఈ ఊరేగింపు కొనసాగింది. అడుగడుగునా సేవాసంస్థలు తాగునీరు, మజ్జిగ, కూల్‌డ్రింక్స్ వంటి పానీయాలు వితరణ చేశారు.



ఉత్సవ జ్యోతిని తీసుకు వస్తున్న అతిథులు



మజ్జిగౌరి మందిరం నుంచి అమ్మవారి విగ్రహాన్ని తీసుకువస్తున్న పూజారులు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జగన్నాథ సరక, ఎంపీ, ఎమ్మెల్యేలు



మజ్జిగ వితరణ చేస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు



ఊరేగింపులో ఆకట్టుకున్న వేషధారణలు

జయపురంలో రాష్ట్ర కాయకల్ప బృందం

జయపురం:

పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిని రాష్ట్ర కాయకల్ప అధికారుల బృందం బుధవారం సందర్శించింది. ముగ్గురు వైద్యాధికారులు ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్, రోగుల వార్డులు, ఓట్‌డోర్, ఇండోర్ విభాగం, మందుల పంపిణీ తదితర వార్డుల్లో కలియ తిరిగారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న అదనపు భవనాలను సందర్శించారు. ఇందులో తాగునీటి ఏర్పాట్లు, కాలువలు, పూలతోట తదితర మార్పులు, చేర్పులపై సూచనలు అందించారు. ఆస్పత్రి విస్తరణపై కేంద్ర, రాష్ట్ర వైద్య విభాగాలు సమకూర్చిన సహాయంపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో బీజూ స్వాస్థ్య కల్యాణ పథకం డైరెక్టర్ అరుణకుమార్ మహాపాత్రొ, యూఎస్ఎఫ్ఈ కో–ఆర్డినేటర్ డాక్టర్ దీపక్‌కుమార్ శత్పతి, రాష్ట్ర కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రాష్ట్ర కాయకల్ప టీమ్

అందరి నోటా.. డకోటా



ప్రత్యేక వాహనంలో రాష్ట్రానికి తరలి వస్తున్న బిజూ పట్నాయక్ డకోటా విమానం



డకోటా డీసీ-3 వీటీ-ఏయూఐ విమానం(ఫైల్)

- రాష్ట్రానికి చేరిన బిజూ పట్నాయక్ డకోటా విమానం

భువనేశ్వర్: రాష్ట్ర ప్రజల చిరకాల కోరిక తీరింది. దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ తన జీవిత కాలంలో అత్యంత ఇష్టంతో వినియోగించిన డకోటా డీసీ–3 వీటీ–ఏయూఐ విమానం ఒడిశాకు తిరిగి వచ్చింది. 1947లో ఇండోనేషియా ప్రధాని సుతాన్ సజారీ, ఉప రాష్ట్రపతి సుకర్ణో లను అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో రక్షించడంలో బిజూ పట్నాయక్ డకోటా విమానంలో చేసిన సాహస కృత్యం అత్యంత అపురూపం. ఈ సాహసంతో ఇండోనేషియా బిజూని తమ దేశ వర పుత్రునిగా ప్రకటించింది. 1997లో బిజూ పట్నాయక్ మరణానంతరం ఆయనకు అత్యంత ప్రీతికరమైన డకోటా విమానం ఒడిశా ప్రభుత్వం పరిరక్షించాలని డిమాండ్ తెర కెక్కింది. అయితే దీర్ఘకాలంగా కోల్‌కతా నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ విమానాశ్రయంలో మరుగున పడి ఉంది. ఈ నేపథ్యంలో దీనిని రాష్ట్రానికి తరలించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఒడిశా సరిహద్దు బాలాసోర్ జిల్లా సరిహద్దుకు ఇప్పటి వరకు విమానం విడి భాగాలను 3 ట్రాలర్లలో తరలించారు. భద్రక్ మైతాపూర్‌కు డకోటా చేరిన తర్వాత ప్రాంతీయ రవాణాశాఖ ఆధ్వర్యంలో స్థానిక పోలీసుల ఎస్కార్ట్‌తో విమానం భద్రతగా భువనేశ్వర్‌కు సురక్షితంగా తరలించే ఏర్పాట్లు చేశారు. దీనిని చూసేందుకు జాతీయ రహదారిపై జనం బారులు తీరారు. 30 ఏళ్ల తర్వాత ప్రభుత్వం ఈ విమానాన్ని ఒడిశాకు తీసుకు రావడంతో రాష్ట్ర ప్రజల దీర్ఘకాల కోరిక తీరింది.

ప్రత్యేకతలివే..

బిజూ పట్నాయక్ వినియోగించిన డకోటా విమానం పొడవు 64 అడుగుల 8 అంగుళాలు. వెడల్పు 96 అడుగులు. ఏరోస్పేస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఇంజినీరింగ్ నిపుణుల బృందం విమానాన్ని వేర్వేరు భాగాలుగా విడదీసి సురక్షిత రవాణాకు సౌకర్యం కల్పించింది. భువనేశ్వర్ బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డకోటా పరిరక్షణకు ఏర్పాట్లు చేశారు. ఈ విమానాశ్రయంలో ప్రజా సందర్శనకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా 1.1 ఎకరాల విస్తీర్ణపు స్థలం కేటాయించింది. కోల్‌కత్తా నుంచి రాష్ట్ర సరిహద్దుకు విమానం రవాణా ట్రాలర్లు చేరడంతో దారి పొడవునా ప్రజలు గుమిగూడి అత్యంత ఆసక్తితో వీక్షించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం బాలేశ్వర్, భద్రక్, జాజ్‌పూర్ జిల్లా పోలీసు యంత్రాంగాలతో జంట నగరాల కమిషనరేట్ పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

పనితీరే ప్రామాణికం

- ప్రజాభిప్రాయాల సేకరణపై సీఎం నవీన్ ఆదేశాలు
- పింఛన్ చెల్లింపులో లోపాల సవరణకు నిర్ణయం



మో సార్కారు కార్యక్రమం పనితీరుని సమీక్షిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్‌తో వివిధ శాఖల ప్రధాన కార్యదర్శులు

భువనేశ్వర్: రాష్ట్రప్రభుత్వ కార్యక్రమం మో సార్కార్(నా ప్రభుత్వం) ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సమీక్షించారు. జిల్లాస్థాయిలో ప్రజాభిప్రాయాల సేకరణ(ఫీడ్ బ్యాక్) మెరుగు పరచాలని కలెక్టర్లను ఆదేశించారు. తరచూ ఈ ప్రక్రియను సమీక్షించి, చర్యలు తీసుకోవాలని చీఫ్ సెక్రటరీ సురేష్ మహాపాత్రొను ఆదేశించారు. దీనితో పాటు, వివిధ విభాగాలు తమ వివరాలను మెరుగు పరచాలని సూచించారు. మో సార్కార్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయానికి విచ్చేసిన వ్యక్తుల స్పందన తరచూ నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ సేవలు పొందేందుకు వచ్చిన వారి పట్ల సిబ్బంది తీరు ఫోన్‌కాల్ ద్వారా సేకరించి సత్వర చర్యలు చేపట్టాలని తెలిపారు. 2019 అక్టోబర్ 2న ఈ కార్యక్రమం ప్రారంభం కాగా.. 2022 మే 28న ముఖ్యమంత్రి తొలిసారిగా దీనిపై సమీక్షించారు. తాజాగా మరోసారి రెవెన్యూ, విపత్తు నిర్వహణ, పంచాయతీరాజ్, తాగునీరు, గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి, మిషన్ ఎనర్జీ, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖలపై సమీక్ష చేపట్టారు.

ప్రజల నుంచి సంతృప్తికరంగా..

31 ప్రభుత్వ శాఖలకు చెందిన 263 సేవలు మో సార్కార్ పరిధిలోకి వచ్చాయి. ఇప్పటి వరకు మొత్తం 3 కోట్ల 77 లక్షల ఫీడ్‌బ్యాక్‌లు నమోదయ్యాయి. 11 ప్రామాణికాల్లో 9 ప్రామాణికాలను మెరుగు పరిచారు. అన్ని విభాగాల సమగ్ర పనితీరు 94.9 శాతం అత్యుత్తమం(అద్భుతం)గా నమోదు కావడం విశేషం. ఆరోగ్య రంగం అత్యుత్తమంగా ఉందని సమీక్షలో వెల్లడైంది. ప్రధానంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న సేవలకు సంబంధించి ప్రజాభిప్రాయం చాలా బాగుంది. 99 శాతానికి పైగా అభిప్రాయాలు అనుకూలంగా ఉన్నాయి. అదే విధంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో 98శాతం ఫీడ్ బ్యాక్ బాగుంది. ఈ అభిప్రాయం ప్రత్యేకంగా బిజూ స్వాస్థ్య కళ్యాణ్ యోజన నుంచి సేకరించారు. గృహ నిర్మాణశాఖ పనుల్లో మెరుగుదల కనిపించినట్లు సమాచారం. పంచాయతీరాజ్, తాగునీటి శాఖలో 96శాతం, రెవెన్యూలో 98 శాతం, పట్టణాభివృద్ధి శాఖలో 92శాతం అద్భుతమైన సేవల ఫీడ్‌బ్యాక్‌ను పొందినట్లు సమీక్షలో వెల్లడైంది. కొత్తగా ఏర్పాటైన మిషన్‌శక్తి విభాగం సేవలను సమీక్షించేందుకు ఫీడ్‌బ్యాక్ వ్యవస్థ జోడించాలని ఈ సమావేశంలో తీర్మానించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, బిల్డింగ్ ప్లాన్ ఆమోదం, బిల్లుల జారీ, కుల ధ్రువీకరణ పత్రాల జారీ తదితర సేవల్లో ప్రజాభిప్రాయం అసంతృప్తిగా వ్యక్తమైంది. ఈ పనితీరుని సంస్కరించి సత్వర చర్యలతో ప్రజలకు సంతృప్తికర సేవలు కల్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

గణనీయంగా తగ్గుముఖం..

గతం కంటే మో సార్కార్ అధీనంలో శాఖల పనితీరు పట్ల ప్రజాభిప్రాయం(ఫీడ్‌బ్యాక్) నమోదు గణనీయంగా మెరుగు పడిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సురేష్ మహాపాత్రొ తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాస్థాయిలో మో సార్కారు ఫీడ్‌బ్యాక్ వ్యవస్థ మరింత పటిష్ట పరిచేందుకు సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల వల్ల వివిధ శాఖల్లో క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరు గణనీయంగా మెరుగుపడిందన్నారు. ప్రభుత్వ సేవల పట్ల అసంతృప్తి ఫిర్యాదుల నమోదు గణనీయంగా తగ్గడం తార్కాణమని అభివృద్ధి కమిషనర్ పీకే జెనా తెలిపారు.

నిర్లక్ష్యంపై అసంతృప్తి..

ప్రజలకు సకాలంలో సంతృప్తికర సేవలను అందజేయడంలో అనుబంధ సంస్కరణలు చేపట్టి సిబ్బంది, అధికారుల పనితీరుని మెరుగు పరచడం మో సార్కారు ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ తెలిపారు. ఈ లక్ష్య సాధనకు ప్రజాభిప్రాయ సేకరణ అత్యంత కీలకమని అధికారులకు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగం నుంచి విరామం పొందుతున్న సిబ్బంది పింఛన్ మంజూరి విషయంలో వ్యవస్థాగత సమస్య వేధిస్తోందన్నారు. ఇటువంటి దీర్ఘకాలిక సమస్యాత్మక పరిస్థితులను సంస్కరించడంలో నిర్లక్ష్యం పట్ల అసంతృప్తి వ్యక్తంచేశారు. సమావేశానికి రెవెన్యూ, విపత్తు నిర్వహణ, పంచాయతీరాజ్, తాగునీరు, పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణం, మిషన్‌శక్తి, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, ఎలక్ట్రానిక్స్, సాంకేతిక సమాచార శాఖల ప్రముఖ కార్యదర్శులు హాజరై ఆయా శాఖల పనితీరు పట్ల నమోదైన ఫీడ్‌బ్యాక్ విశ్లేషణను ప్రవేశపెట్టారు.

క్లుప్తంగా

స్వర్ణ కంకణంతో గురువుకు సత్కారం



చంద్రశేఖర్‌శర్మను సన్మానిస్తున్న శిష్యులు

కోటబొమ్మాళి: స్థానిక మెయిన్ రోడ్డుకు చెందిన అష్టావధాని సుసరాపు చంద్రశేఖర్‌శర్మకు అతని శిష్యులు బుధవారం స్వర్ణ కంకణం బహూకరించి ఘనంగా సన్మానించారు. కొత్తపేటలోని శివకేశవ ఆలయ ప్రాంగణంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో వేదపండితులు అంపోలుకు చెందిన రుద్రకోటేశ్వరశర్మ, శ్రీకాకుళం పట్టణానికి చెందిన సుసరాపు దుర్గాప్రసాద్‌శర్మ చేతులమీదుగా చంద్రశేఖర్‌శర్మ చేతికి స్వర్ణ కంకణాన్ని తొడిగారు. చంద్రశేఖర్‌శర్మ అష్టావధానం, హరికథలు, పౌరానిక నాటకాలు, కవిత్వంలో ప్రావీణ్యత చూపారని, సుమారు 300 మంది శిష్యులకు వేదవిద్యను నేర్పించారని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో వనమాలి శాంతారావు, తేన్నేటి సతీల్‌వర్మ, సుసరావు గణపతిశర్మ పాల్గొన్నారు.

హిందూ ట్రోఫీలో సూర్యకిరణ్ ప్రతిభ



మద్దెల సూర్యకిరణ్

శ్రీకాకుళం న్యూకాలనీ: విశాఖపట్నంలోని వీడీఏ–వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న హిందూ ట్రోఫీలో జిల్లాకు చెందిన క్రికెటర్ మద్దెల సూర్యకిరణ్ ప్రతిభ కనబర్చాడు. విశాఖపటణంతో జరుగుతున్న మ్యాచ్‌లో వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన సూర్యకిరణ్ 125 బంతుల్లో 187 పరుగులు చేసి శభాష్ అనిపించాడు. ఇందులో 19 బౌండ్రీలు, పది సిక్సర్లు ఉన్నాయి.

గతంలో ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు..

ఇటీవల జరిగిన టీ–20 మ్యాచ్‌లో ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లు కొట్టి సంచలనం నమోదు చేసిన సూర్యకిరణ్.. అదే మ్యాచ్‌లో 46 బంతుల్లో 134 పరుగులు చేసి చరిత్ర సృష్టించాడు. తాజాగా విశాఖతో జరిగిన మ్యాచ్‌లో మరోసారి భారీ సెంచరీతో కదంతొక్కి సెలక్టర్లను సైతం ఆకట్టుకున్నాడు. సూర్యకిరణ్ టెక్కలిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. శ్రీకాకుళం నగరంలో నివాసం ఉంటున్న సూర్యకిరణ్ తండ్రి మద్దెల ప్రసాద్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా, తల్లి విజయలక్ష్మి గృహిణి.

ఆర్మీక్యాంటీన్ ప్రారంభోత్సవం వాయిదా



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆర్మీ క్యాంటీన్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 20న ఇండియన్ ఆర్మీ క్యాంటీన్ ప్రారంభిస్తున్నట్లు మాజీ సైనికుల సంఘం జాయింట్ సెక్రటరీ అట్టాడ మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ఈ నెల 27న ప్రారంభించాలని నిర్ణయించినా.. హైదరాబాద్ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తేదీ మార్చినట్లు పేర్కొన్నారు. కాశీబుగ్గ రైల్వే ఎల్‌సీ గేటు సమీపంలో చినబాడాం రెవెన్యూ పరిధిలో ఈ క్యాంటీన్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ మురళీకృష్ణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎచ్చెర్ల నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా కొవ్వాడ ఉప కలెక్టర్ పి.మురళీకృష్ణను నియమిస్తూ కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం రణస్థలం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఈ నెల 25న నిర్వహించనున్న జాతీయ ఓటర్ల దినోత్సవంపై చర్చించారు. కొవ్వాడ ప్రాజెక్టు పనులు పరిశీలించి సమస్యలపై ఆరా తీశారు.



వేదికపై ప్రసంగిస్తున్న మంత్రి జగన్నాథ సరక



వేదికపై మంత్రి జగన్నాథ, ప్రముఖులు



మహిళల దురువ నృత్యం


ముగిసిన మహోత్సవం

- అట్టహాసంగా పూర్తయిన మల్కన్‌గిరి మాల్యవంత్ ఉత్సవాలు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో ఈనెల 15 నుంచి 17వరకు జరిగిన మాల్యవంత్ మహోత్సవాలు సందడిగా ముగిసాయి. మూడొ రోజు మంగళవారం జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్సవ కలశం వద్ద జగన్నాథ స్వామికి జ్యోతి వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవాల విజయవంతంలో ప్రతి ఒక్కరి కృషి ఉందన్నారు. గిరిజనుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఇటువంటి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియాలో జరిగిన గుర్రపు పందెం, మల్కన్‌గిరి సత్తిగూఢ డ్యామ్‌లో జరిగిన పడవ పందేలు, మినీ మారథన్ విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే జిల్లాలో గంజాయి సాగు, దాని అనర్థాలపై స్థానిక యువకులు రూపొందించిన షార్ట్‌ఫిలిమ్‌ను విడుదల చేశారు. వీటితో పాటు సంబల్‌పూర్‌కు చెందిన సింగార్ మౌంటు చురియా, అసిమా పండా బృందం, కళాకారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కలెక్టర్ విశాల్‌సింగ్, చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, జిల్లా ఎస్పీ నితీష్ వాధ్వనీ, సబ్ కలెక్టర్ అక్షయకుమార్ ఖేముండు, చిత్రకొండ సమితి అధ్యక్షురాలు రాజేశ్వరీ ఖీలో, మల్కన్‌గిరి పురపాలక అధ్యక్షుడు మనోజ్‌కుమార్ బారిక్, మత్తిలి సమితి అధ్యక్షుడు మహేష్ బక్క, కలిమెల సమితి అధ్యక్షరాలు సుహసిని సోడి, మల్కన్‌గిరి సమితి అధ్యక్షరాలు గౌరీ పాడియామి, కోరుకొండ సమితి అధ్యక్షుడు జిత్ బురిధి, ఖొయిర్‌పుట్ సమితి అధ్యక్షుడు విష్ణుకిర్సనీ, బలిమెల ఏఎస్పీ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ నాయక్, ఇతర సభ్యులు పాల్గొన్నారు



కార్యక్రమానికి హాజరైన ఔత్సాహికులు



కస్తూర్బా పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు

విద్యుత్ చార్జీలపై నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

- శ్రీకాకుళం, టెక్కలి, పాలకొండ డివిజన్ కార్యాలయాల నుంచి వినియోగదారుల హాజరుకు అవకాశం

అరసవల్లి: విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై గురువారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు వర్చువల్ పద్ధతిలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. దీని కోసం సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు పనివేళల్లోనే బహిరంగ విచారణ కార్యక్రమం జరుగనుంది. ఇందుకోసం శ్రీకాకుళం విద్యుత్ సర్కిల్/డివిజనల్ కార్యాలయంతో పాటు టెక్కలి, పాలకొండ డివిజన్ల కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికల వద్దకు ఆయా పరిధిలోని వినియోగదారులు హాజరై వారి అభిప్రాయాలను, చార్జీల ప్రతిపాదనలపై సూచనలను చేయవచ్చు. దీంతో పాటు 'ఏపీఈఆర్‌సీపబ్లిక్‌హియరింగ్' వెబ్ లింక్ ద్వారా కూడా అభిప్రాయాలను తెలియజేసేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా బుధవారం శ్రీకాకుళంలోని సర్కిల్ కార్యాలయంలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారు. జిల్లా విద్యుత్ శాఖ సర్కిల్ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ మాట్లాడుతూ.. సర్కిల్ కార్యాలయంతో పాటు పాలకొండ, టెక్కలి ఈఈ కార్యాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఈ దైవప్రసాద్, శ్రీకాకుళం ఈఈ బయ్యన్నాయుడు

మానవత్వం పరిమళించిన వేళ..

ఇచ్ఛాపురం: అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం మిగిలే ఉందని నిరూపించారు ఇచ్ఛాపురం పోలీసుస్టేషన్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ టి.రామారావుతోపాటు కొంతమంది స్థానికులు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని దాసన్నపేట కూడలి వద్ద సుమారు 70 ఏళ్ల వృద్ధుని మృతదేహాన్ని స్థానికులు బుధవారం గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌కి సమాచారం ఇచ్చారు. పోలీసులు వివరాలు సేకరించగా వారం రోజులుగా పట్టణ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకున్న వ్యక్తిగా గుర్తించారు. అయితే అనాథ అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ టి.రామారావుతోపాటు కొంతమంది స్థానిక యువకులు, మున్సిపల్ సిబ్బంది సహాయంతో వృద్ధుని మృతదేహాన్ని బాహుదానది వద్దకు తీసుకెళ్లి హిందూ సంప్రదాయ పద్ధతిలో కర్మకాండలు పూర్తిచేసి మానవత్వాన్ని చాటుకున్నారు. తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్నాథం సహకరించారు. హెడ్‌కానిస్టేబుల్ రామారావును సీఐ ఆర్ ఈసీహెచ్ ప్రసాద్, పట్టణ ఎస్సై కె.గోవిందరావు ఇతర సిబ్బంది అభినందించారు.



అనాథ మృతదేహానికి కర్మకాండలు నిర్వహిస్తున్న హెచ్‌సీ రామారావు తదితరులు

కానిస్టేబుల్ ఉద్యోగాల పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



శ్రీకాకుళం క్రైమ్: ఆదిత్య డిగ్రీ కళాశాల కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ జి.ఆర్.రాధిక తదితరులు

- ఎస్పీ జి.ఆర్.రాధిక
- పరీక్ష కేంద్రాల పరిశీలన

శ్రీకాకుళం క్రైమ్: ఈ నెల 22న జరగనున్న పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక చెప్పారు. నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా గట్టి భద్రతా చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం పట్టణంలో పరీక్ష కేంద్రాలుగా కేటాయించిన ఆదిత్య, భాష్యం, చైతన్య తదితర కళాశాలలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కేంద్రాల వద్ద నిబంధనలు అనుసరించేలా పలు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన మేరకు పోలీసు సిబ్బందిని నియమించాలని, సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చూడాలన్నారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ మహేంద్ర మాతే, ఒకటో పట్టణ సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్సై బలివాడ గణేష్ ఉన్నారు.

టెక్కలిలో..

టెక్కలి: టెక్కలి మండలంలో కేటాయించిన 14 కేంద్రాలల్లో కొన్నింటిని ఎస్పీ పరిశీలించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డీటీసీ డీఎస్పీ జి.శ్రీనివాసరావు, టెక్కలి సీఐ ఎస్.సూర్యచంద్రమౌళి, ఎస్సై ఎల్.రామకృష్ణ ఉన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం గ్రామ సమీపంలో మగళవారం రాత్రి ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో టెక్కలికి చెందిన ఆటో డ్రైవర్ బబ్బుల్లా మృతిచెందగా.. సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం గ్రామానికి చెందిన యువకుడు పేరాడ పవన్ (19 తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం పవన్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

భర్తకు తలకొరివి పెట్టిన భార్య

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ బబ్బుల్లా మృతదేహానికి అతతి భార్య జగదీశ్వరి బుధవారం తలకొరివి పెట్టి అంత్యక్రియలు పూర్తి చేశారు. కుమారులు చిన్నపిల్లలు కావడంతో అమె తలకోరివిపెట్టి భర్త రుణాన్ని తీర్చుకున్నారు.

కారు ఢీకొని రైతు దుర్మరణం



సింహాచలం మృతదేహం

కోటబొమ్మాళి: కారు ఢీకొని రైతు దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన నారాయణవలస గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణవలస కాలనీకి చెందిన రైతు ఉర్జాన సింహాచలం (56) బుధవారం తన వ్యవసాయ పొలానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా.. నరసన్నపేట నుంచి చల్లపేట వైపు వేగంగా వెళ్తున్న కారు అతన్ని బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన సింహాచలాన్ని 108 వాహనంలో నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రమణమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్‌విశ్వేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జలుమూరు: మండలంలోని చల్లవానిపేట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి మండలం చిన్నతుంబయ్యపేటకు చెందిన రావాడ లక్ష్మణరావు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణరావు సిమెంట్ బస్తాలు కొనేందుకు స్కూటీపై వెళ్తుండగా.. శ్రీకాకుళం నుంచి పాతపట్నం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న రొమదల గ్రామానికి చెందిన రేగేటి అమర్‌నాథ్ ఢీకొట్టాడు. ఈ ఘటనలో లక్ష్మణరావు తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు స్పందించి ప్రైవేట్ వాహనంలో నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. లక్ష్మణరావు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు.

చోరీపై కేసు నమోదు



ధ్వంసమైన బీరువా

టెక్కలి రూరల్: తన ఇంట్లో చోరీ జరిగిందని స్థానిక అయ్యప్పనగర్‌లో నివాసముంటున్న కొత్తపల్లి చిన్నమ్మడు ఫిర్యాదు చేసినట్టు పోలీసులు బుధవారం తెలిపారు. కుమార్తెతో కలిసి చిన్నమ్మడు అయ్యప్పనగర్‌లోని అద్దె ఇంట్లో ఉంటోంది. మంగళవారం ఆదిఆంధ్రవీధిలో ఉన్న బంధవులు ఇంటికి వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచిఉండడంతోపాటు వస్తువులన్నీ చిందరవందరగా పడేసి ఉండటాన్ని గమనించారు. బీరువా తాళం సైతం పగలగొట్టి అందులో ఉంచిన అరతులం బంగారం, కొంత నగదు చోరీకి గురైనట్టు గుర్తించిన చిన్నమ్మడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. టెక్కలి ఎస్సై రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

యువత మత్తుకు బానిస కావద్దు



ఒక్క అడుగు షార్ట్‌ఫిల్మ్‌ను విడుదల చేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. బుధవారం పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద గ్రీన్‌ఆర్మీ సభ్యులు రూపొందించిన 'ఒక్క అడుగు' అనే షార్ట్‌ఫిల్మ్‌ను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడిచి భావితరాలకు బంగారు బాటలు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలాస–కాశీబుగ్గ మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాలరావు, గౌరవాధ్యక్షుడు బత్తిన ఓంకార్, పలాస సినిమా నటుడు రామకృష్ణ, ప్రభుత్వ ఉపాధ్యాయులు బోకర దుర్యోధన, కిషోర్‌కుమార్ పాత్రో, ఇరిగేషన్ శాఖ అధికారి శ్రీనివాసరావు, బీసీ వెల్ఫేర్ నీలాపు ఉపేంద్రరెడ్డి, దాసరి శ్రీనివాసరావు, పారిశుద్ధ్య కార్మికుల సంఘ నాయకులు చింతల మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతినెలా సివిల్ రైట్స్ డే

- సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: ఎస్సీ, ఎస్టీల సామాజిక రక్షణ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధిగా ఉందని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. ప్రతినెల కచ్చితంగా సివిల్ రైట్స్ డే కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం డివిజన్ స్థాయిలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సమావేశంలో ప్రస్తావించిన అంశాలపై మూడు రోజుల్లోగా నివేదిక అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసులు సంయుక్తంగా డీవీఎంసీ సభ్యులతో బహిరంగ ప్రదేశాల్లో సివిల్ రైట్స్ డే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దీని వల్ల సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కారమవుతాయన్నారు. డీవీఎంసీ సమావేశాల్లో కేవలం అట్రాసిటీ అంశాలను మాత్రమే ప్రస్తావించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం కొత్తగా గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీలకు ప్రత్యేకంగా శ్మశానవాటికల కోసం స్థల సేకరణ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు. కనీసంగా 50 సెంట్ల నుంచి ఒకఎకరా వరకు స్థలాన్ని గుర్తించి త్వరితగతిన ప్రతిపాదనలు పంపించాలని తహసీల్దార్లను ఆదేశించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు. డీవీఎంసీ సమావేశానికి పోలీసులు హాజరు కావడం లేదని, అట్రాసిటీ కేసుల్లో పోలీసులు స్టేషన్ బెయిల్ ఇస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని డీవీఎంసీ సభ్యుడు బి.నారాయణరావు కోరారు. దళితుల భూ సమస్యలపై రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అత్యధికంగా ఎస్సీ, ఎస్టీలు కలిగిన నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్‌లోకి చేర్చాలని విజ్ఞప్తి చేశారు. అట్రాసిటీ చట్టం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని, టెక్కలి అంబేడ్కర్ భవన్‌లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలని, ఐటీడీఏ, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో వార్డెన్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులకు భోజనాలు పెట్టడం లేదని మరో సభ్యుడు బి.ప్రభాకర్రావు ప్రస్తావించారు. మెళియాపుట్టి మండలం చందనగిరిలో గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని మరో సభ్యుడు జి.రమణమూర్తి ప్రస్తావించారు. దళితులకు కేటాయించిన శ్మశాన వాటికలు ఆక్రమణలకు గురవుతున్నాయని తక్షణమే చర్యలు తీసుకోవాలని డీవీఎంసీ సభ్యుడు చల్లా రామారావు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం టెక్కలి మండలంలో పలు ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో సమస్యలపై ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితో వర్సిటీ ప్రగతి

ఎచ్చెర్ల క్యాంపస్: అందరి కృషితోనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రగతి సాధిస్తోందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. విశ్వవిద్యాలయం వీసీగా రెండేళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా సెమినార్ హాలులో బుధవారం బోధన, బోధనేతర సిబ్బంది అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 325 మందికి వసతి కల్పించే హాస్టల్ భవన పనులు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. త్వరలో ఒడియా పీఠం ప్రారంభిస్తామన్నారు. ఈ–ఆఫీస్, ఆన్‌లైన్ ఫీజుల చెల్లింపు పక్కాగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. మెరుగైన విద్యా ప్రమాణాలు తీసుకువచ్చి జాతీయ స్థాయిలో ఉత్తమ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ఉదయ్‌భాస్కర్, పాలక మండలి సభ్యులు స్వప్నవాహిణి, చిన్నారావు, పద్మాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ నిమ్మ వెంకటరావు

క్లుప్తంగా

స్కూల్ అసిస్టెంట్‌లుగా 31 మందికి పదోన్నతి

విజయనగరం పూల్‌బాగ్‌: నూతన విద్యావిధానంలో స్కూళ్లలో 3వతరగతి నుంచి సబ్జెక్టుల బోధనకు సీనియర్ సెకండరీ టీచర్ల (ఎస్‌జీటీలు)కు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి ఇవ్వాలని ప్రభుత్వం భావించింది. దీనికోసం తగిన అర్హతలున్న ఉపాధ్యాయులు జిల్లాలో 100 మందికి గడిచిన గురువారం కౌన్సెలింగ్ నిర్వహించగా ఆ రోజు మిగిలిన పోస్టులు ఇంగ్లీష్ 16, మేథ్స్ 15 పోస్టులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించడంతో పదోన్నతుల ప్రక్రియ పూర్తయింది.

ఆటో, బైక్ ఢీ: పలువురికి గాయాలు

సాలూరు: పాచిపెంట మండలం పి.కోనవలస సమీపంలో ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో పలువురికి గాయలయ్యాయని పాచిపెంట హెచ్‌సీ కృపారావు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సాలూరు నుంచి పి.కోనవలస మీదుగా అరకు వెళ్తున్న ఆటో, ఒడిశా నుంచి సాలూరు వస్తున్న ద్విచక్రవాహనదారుడు ప్రకాష్ పి.కోనవలస సమీపంలో ఢీకొన్నారు. దీంతో జరిగిన ప్రమాదంలో ద్విచక్రవాహనదారు ప్రకాష్‌కు తీవ్రగాయాలవగా, ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులు, బైక్ వెనుక కూర్చున్న వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సాలూరు ఆస్పత్రికి తరలించగా, ప్రకాష్‌ను విజయనగరం ఆస్పత్రికి రిఫర్ చేశారు. దీనిపై కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

చీమల మందు తాగి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న పడిషు

పార్వతీపురం: పార్వతీపురం మండలం డోకిశీలకు చెందిన ఆర్.పడిషు చీమల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. మద్యం తాగి వచ్చినందుకు తల్లి మందలించడంతో మనస్తాపానికి గురై చీమల మందు తాగేశాడు. గమనించిన స్థానికులు 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన సురేష్

సాలూరు: పట్టణంలోని మహంతివీధిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న వి.సురేష్ (46) ఉరి వేసుకుని బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న సురేష్ మద్యానికి బానిస కావడంతో మద్యం మానివేయాలని భార్యాపిల్లలు కోరారు. దీంతో మనస్తాపం చెందిన సురేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య ఉమామహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై పాపారావు తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి


చంద్రశేఖర్ (ఫైల్)

పార్వతీపురం: మండలంలోని హెచ్ కారాడవలసకు చెందిన పిచ్చిక చంద్రశేఖర్ (35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి టీబీఆర్ థియేటర్‌కు సెకెండ్ షో సినిమా చూసేందుకు వెళ్తానని చంద్రశేఖర్ ఇంటిదగ్గర చెప్పి వచ్చాడు. అయితే బుధవారం ఉదయం టీబీఆర్ హాల్, మారుతి షోరూం మధ్య రహదారిలో విగతజీవిగా పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్సై వై.సింహాచలం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదుచేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎక్కువగా మద్యం తాగడం వల్ల చనిపోయాడా? ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో చనిపోయాడా? అన్నది దర్యాప్తులో తేలనుందని ఎస్సై తెలిపారు.

ఆత్మస్థైర్యంతో అవలీలగా

- వారికి వారే సాటి
- వైకల్యం ఉన్నా కష్టించి పని
- ఏళ్లతరబడి పూడుకుపోయిన సాగునీటి కాలువ వినియోగంలోకి
- ఉపాధి పథకం పనుల్లో తుప్పలు, రాళ్లూరప్పల తొలగింపు
- రాష్ట్రస్థాయి అధికారుల ప్రశంసలు అందుకున్న దివ్యాంగుల గ్రూపు


చానల్‌లో పనిచేస్తున్న దివ్యాంగులు


దివ్యాంగులు బాగు చేసిన ఫీడర్ చానల్

విజయనగరం ఫోర్ట్‌: వారు విధి వంచితులు. పుట్టుకతో వైకల్యం వచ్చినవారు కొందరైతే ప్రమాదాల బారిన పడి మరి కొంతమంది వైకల్యం పొందారు. వైకల్యం ఉన్నప్పటికీ వారు కుంగిపోలేదు. మనో నిబ్బరంతో ముందుకు సాగారు. డ్వామా అధికారులు తమకు అప్పగించిన పనిని భగీరథుల్లా పూర్తిచేసి చూపించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నవారి కంటే బాగా పనిచేసి మెరుగైన ఫలితాన్ని అందించారు. వారు చేసిన పనికి పలువురి ప్రశంసలు అందాయి.

వినియోగంలోకి 10 ఏళ్ల నాటి ఫీడర్ చానల్

బొండపల్లి మండలం ఒంపల్లి గ్రామంలో 20 మంది దివ్యాంగులు ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లేందుకు ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. దీంతో వారికి ఒక బృహత్తర కార్యక్రమాన్ని డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి అప్పగించారు. 10 ఏళ్ల క్రితం నాటి గ్రామంలోని ఫీడర్ చానల్ తుప్పలు, రాళ్లూరప్పలతో పేరుకుపోయింది. దీన్ని వినియోగింలోకి తెచ్చే బాధ్యతను దివ్యాంగులకు డ్వామా అధికారులు అప్పగించారు. గ్రామంలో ఉన్న పెద్ద కొండ నుంచి జంగిల్ క్లియరెన్స్ చేసుకుంటూ ఫీడర్ చానల్ పనులు మొదలుపెట్టారు. కొండమీద నుంచి వచ్చే వరద ప్రవాహానికి తగినట్టు చానల్ పొడవు, వెడల్పు చేస్తూ అద్భుతంగా పనులు చేశారు. అదేవిధంగా ఏళ్ల క్రితం మూసుకుపోయిన చెక్‌డ్యామ్‌ను కూడా వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ ఫీడర్ చానల్ నుంచి నీరు అప్పలా చెరువుకు వెళ్తుంది. ఈ చెరువు కింద 35 ఎకరాల సాగు భూమి ఉంది. ప్రస్తుతం సాగునీటి కాలువ ద్వారా వచ్చిన నీటితో చెరువు కళకలాడుతోంది.


ఫీడర్ చానల్ ద్వారా వచ్చిన వరదనీటితో కళకళలాడుతున్న అప్పల చెరువు

జిల్లాకే ఆదర్శంగా దివ్యాంగుల గ్రూపు

ఒంపల్లి దివ్యాంగుల గ్రూపు జిల్లాకే ఆదర్శంగా నిలిచింది. ఉపాధి హామీ వేతనదారులకు ఇచ్చే సరాసరి వేతనం రూ.257 గ్రూప్ సభ్యులకు వస్తుంది. వారి పనితీరు చాలా బాగుండడంతో ఇటీవల పర్యటించిన రాష్ట్ర స్థాయి బృందం సభ్యులు ప్రశంసలు అందజేసింది.

మరువాడ గ్రామంలో కూడా..

ఒంపల్లి దివ్యాంగులను ఆదర్శంగా తీసుకుని మరువాడ గ్రామానికి చెందిన దివ్యాంగులు కూడా మరువాడ కొండ నుంచి సీతయ్య చెరువుకు ఫీడర్ చానల్ పనులు చేస్తున్నారు. సీతయ్య చెరువును అనుకుని 45 ఎకరాల సాగు భూమి ఉంది. ఈ చానల్ పనులు పూర్తయితే 45 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

మంచి పనిచేయడంతో సంతోషంగా ఉంది



నాకు ఒక కాలు లేదు. నాలాంటి దివ్యాంగులు అందరం ఒక గ్రూపుగా ఏర్పడి ఉపాధి పనికి వెళ్తన్నాం. ఫీడర్ చానల్ జంగిల్ క్లియరెన్స్ పనులు మాకు అప్పగించారు. రైతులకు ఉపయోగే పని కావడంతో వైకల్యాన్ని లెక్క చేయకుండా అందరం కలిసికట్టుగా పనిచేయడం సంతోషంగా ఉంది. గంద్రేటి సత్యం, ఒంపల్లి

గ్రూప్ సభ్యులతో కలిసి కాలువ పని



నాకు ఒక కన్ను కనిపించదు. అయినప్పటికీ మాగ్రూపు సభ్యులతో కలిసి కాలువ పని పనిచేశాను. కాలువలో ఉన్న మట్టి, రాళ్ల తొలగించాం. సాగునీటి ప్రవాహానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా కాలువ పనులు పూర్తి చేశాం.
బి.అప్పలనారాయణ, ఒంపల్లి

అద్భుతంగా పనిచేశారు



దివ్యాంగులు అయినప్పటికీ చాలా అద్భుతంగా పనిచేశారు. ఫీడర్ చానల్‌లో పేరుకుపోయిన తుప్పలు, రాళ్ల తొలగించారు. దివ్యాంగులకు నిరంతరం సూచనలు, సలహాలు మా సిబ్బంది అందించారు.
జి. ఉమాపరమేశ్వరి, డ్వామా పీడీ

రూ.6,095 కోట్లతో నాబార్డ్ రుణ ప్రణాళిక

- వ్యవసాయ రుణాలకు ప్రాధాన్యం
- బ్యాంకర్ల సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్


పోస్టర్‌ను విడుదల చేస్తున్న జేసీ మయూర్ అశోక్


హాజరైన జిల్లా అధికారులు, బ్యాంక్ అధికారులు

విజయనగరం అర్బన్‌: నాబార్డ్ ద్వారా వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.6,095 కోట్లతో నాబార్డ్ రూపొందించిన రుణ ప్రణాళికను జేసీ ఆవిష్కరించారు. ఈ మేరకు లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బ్యాంకర్ల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నాబార్డ్ రుణ ప్రణాళికలో వ్యవసాయ రుణాలు, వ్యవసాయ ఉత్పత్తులు, నిర్వహణ, మార్కెటింగ్, జల వనరులు, వేస్ట్ ల్యాండ్ డెవలప్‌మెంట్, పశు సంవర్ధకం, డైరీ, పౌల్ట్రీ, షీప్, గోట్ మత్స్య సంబంధిత రంగాలకు రూ.3,685 కోట్లను కేటాయించినట్లు చెప్పారు. మిగిలిన నిధులు వ్యవసాయ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వాటర్ షెడ్ డెవలప్‌మెంట్, సాయిల్ కన్జర్వేషన్, ఇంధన వనరులు, విద్య, హౌసింగ్ సోషల్ సోషల్ ఇన్‌ఫ్రా, ఎంఎస్ఎంఈ వర్కింగ్ క్యాపిటల్ తదితర రంగాలకు కేటాయించినట్లు వివరించారు. ఈ రుణ పరపతిపై అవగాహన కలిగించుకుని, సంబంధిత లబ్ధిదారులకు అందేలా అధికారులు కృషి చేయాలని కోరారు.

జగనన్న తోడు పెండింగ్ ఉండకూడదు

ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న తోడు 5వ విడత దరఖాస్తులు పెండింగ్ లేకుండా వెంటనే చెల్లించాలని తర్వాత 6వ విడత దరఖాస్తులను గ్రౌండింగ్ చేయాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. ఈ అంశంపై బ్యాంకు అధికారులు క్రియాశీలకంగా వ్యవహరించి ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. అదేవిధంగా గృహాలకు సంబంధించి రుణాలను ఎలాంటి పెండింగ్ లేకుండా మంజూరు చేయాలని కోరారు. అనంతరం యువత స్వయం ఉపాధి అవకాశాల పోస్టర్‌ను, రుణ ప్రణాళిక షెడ్యూల్‌ను విడుదల చేశారు. సమావేశంలో నాబార్డ్ డిప్యూటీ డైరెక్టర్ నాగార్జున, రిజర్వ్ బ్యాంకు ప్రతినిధులు, జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులు, జిల్లా అధికారులు డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు కల్యాణ చక్రవర్తి, సుధాకరరావు, పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ రమణ, మత్స్యశాఖ డీడీ నిర్మలా కుమారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు పాత నేరస్తుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్ సీఐ ఎస్.కాంతారావు, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, తదితరులు

విజయనగరం క్రైమ్‌: సంక్రాంతి పండగ నేపథ్యంలో ఇళ్లల్లో చోరీచేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్న ఇద్దరు పాత నేరస్తులు పట్టణంలోని అలకానంద కాలనీలో ఈ నెల13 నుంచి 16వ తేదీ మధ్యలో చోరీకి పాల్పడి 12 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన వన్‌టౌన్, సీసీఎస్ పోలీసులు కొద్ది గంటల వ్యవధిలోనే కేసును ఛేదించారు. దీనికి సంబంధించి సీసీఎస్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ కాంతారావు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అలకానంద కాలనీలో నివాసం ఉంటున్న కె.సన్యాసినాయుడు సంక్రాంతి పండగ నిమిత్తం పెదవేమలి గ్రామంలో బంధువుల ఇంటికి కుటుంబంతో కలిసి ఈ నెల 13న వెళ్లాడు. 16న ఇంటికి వచ్చి చూసేసరికి ఉన్న తలుపులు తెరిచి బెడ్‌రూమ్‌లో ఉండడంతో బీరువాలో ఉన్న సుమారు 12 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. అలాగే బాధితుడి ఇంటిపక్క ఉన్న మరో ఇంట్లో కూడా బంగారు చెవిదిద్దులు పోయినట్లు తెలుసుకుని బాధితులిద్దరూ వన్‌టౌన్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో రంగంలోకి దిగిన వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, సీసీఎస్ సీఐ ఎస్.కాంతారావులు విచారణ ప్రారంభించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితులను పాత నేరస్తులైన నెల్లిమర్ల మండలం జరజాపుపేట గ్రామానికి చెందిన అవనాపు అప్పలస్వామి, విశాఖకు చెందిన దుంప గణేష్‌లుగా నిర్ధారించి వారి కదలికలపై నిఘా పెట్టారు.

12 తులాల బంగారు ఆభరణాల రికవరీ

స్థానిక ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో బుధవారం అనుమనాస్పదంగా తిరుగుతున్న పాత నేరస్తులిద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి 12 తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. కేసు ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన ఏఎస్సై ఎ.గౌరీశంకర్, హెచ్‌సీలు మహమ్మద్ ఇమ్రాన్, డి.శంకరరావు, డి.శ్రీనివాసరావు, కె.సత్యం, సీహెచ్‌వీ.పైడిరాజు, ఎస్సైలు సుదర్శన్, వి.అశోక్ కుమార్‌లను ఎస్పీ అభినందించారు.

స్టాఫ్ నర్సుల ఎంపిక నిలుపుదల

- తప్పులు తడకలతో తుది జాబితా
- అన్యాయం జరిగిందని నర్సుల నిరసన
- సిబ్బందిపై అవినీతి ఆరోపణలు
- 'సాక్షి'లో కథనం రావడంతో ఉలికిపాటు
- జాబితాను మళ్లీ పరిశీలిస్తున్న అధికారులు
- అర్హులకు అన్యాయం జరగదంటున్న ఆర్డీ

మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీని తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఎంపిక జాబితాలో తమకు అన్యాయం జరిగిందని నిరుద్యోగ నర్సులు, వెయిటేజీ మార్కులు కలపలేదని తాత్కాలిక ఉద్యోగులు బుధవారం కూడా తన నిరసన గళం వినిపించారు. దాదాపు 30 నుంచి 40 మందికి వెయిటేజ్ మార్కులు కలపలేదన్న విషయం బయటకు రావడంతో.. ఈ జాబితాను పునఃపరిశీలన కోసం అధికారులు భర్తీ ప్రక్రియను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. స్టాఫ్ నర్సుల ఎంపికలో గందరగోళంపై బుధవారం 'సాక్షి'లో కథనం రావడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. తప్పుల తడకలతో కూడిన 172 మంది అభ్యర్థుల జాబితాను మళ్లీ పరిశీలిస్తున్నారు. కొంతమందికి అనవసరంగా ఎలా మార్కులు కలిశాయన్న దానిపై ఆరా తీస్తున్నారు. అమరావతి నుంచి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విశాఖ చేరుకుని జాబితాను పరిశీలిస్తున్నారు. స్టాఫ్ నర్సుల పోస్టుల కోసం ఇప్పటివరకు నాలుగు సార్లు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది జాబితాను తయారు చేశారు. ప్రభుత్వం జీఓ ప్రకారం జాబితా తయారు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ.. ఎంపికలో సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హులను తప్పించడం, అనర్హులను అందలం ఎక్కించడం కోసం సిబ్బంది చేతివాటం ప్రదర్శించారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఎంపికైన 172 మందిలో 100 మంది సర్టిఫికెట్లను మంగళవారం పరిశీలించారు. బుధవారం మరో 30 మంది సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. జాబితాను పునఃపరిశీలన చేస్తున్న క్రమంలో ఇందులో ఎంత మంది పేర్లు ఉంటాయో.. ఊడతాయో మరి.! కాగా.. ఎంపిక జాబితా రూపొందించడంలో సిబ్బంది తీరుపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. తమ జీవితాలతో సిబ్బంది చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకసారి మార్కులు కలపడం, మరోసారి తొలగించడం, ఎంపిక జాబితాలో కొందరి పేర్లు ఇప్పుడు తొలగించడం.. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పనితీరుకు అద్దం పడుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

అభ్యర్థుల్లో ఉత్కంఠ

పోస్టుల సంఖ్య పెరగడం, కోవిడ్ సమయంలో పనిచేసిన వారికి అదనపు మార్కులు కలపడం వంటి నిర్ణయాలు రావడంతో మెరిట్ లిస్టుకు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఉమా సుందరి ఆధ్వర్యంలో తుది మెరుగులు దిద్దుతున్నారు. అమరావతి నుంచి వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కూడా ఇందుకు సహకారం అందిస్తున్నారు. దీంతో కొత్త జాబితా కోసం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల అభ్యర్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో హత్య కేసు ఛేదిస్తాం

- ఎస్పీ దీపికా పాటిల్


హత్యకు గురైన వ్యక్తి మృతదేహం లభ్యమైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ దీపికాపాటిల్

తెర్లాం: మండలంలోని వెలగవలస సమీపంలో గల మామిడి తోటలో లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసును ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ దీపికాపాటిల్ తెలిపారు. ఈ నెల 16న గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ప్రదేశాన్ని ఎస్పీ బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మృతదేహం లభ్యమైనప్పటి నుంచి సేకరించిన విషయాలు, మృతుని శరీరంపై ఉన్న దుస్తులు, ఇతర అంశాల గురించి బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు, తెర్లాం ఎస్సై ఆర్.రమేష్‌లను అడిగి తెలుసుకున్నారు. విశాఖపట్నం నుంచి ఫోరెన్సిక్ ల్యాబ్ అధికారులు, సిబ్బందిని సంఘటనా స్థలానికి రప్పించి నిశితంగా తనిఖీ చేయించారు. ఎస్పీతో పాటు బొబ్బిలి డీఎస్పీ మోహన్‌రావు, బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు, తెర్లాం, బాడంగి ఎస్సైలు ఆర్.రమేష్, జయంతి, ఫోరెన్సిక్స్ అధికారులు ఉన్నారు.

5 టన్నుల పీడీఎస్ బియ్యం సీజ్


మద్యం సీసాలతో పట్టుబడిన అప్పలనాయుడు

కొత్తవలస: మండలంలోని నరపాం గ్రామంలో సత్యవరపు వెంకట బంగార్రాజు ఇంటి వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఐదు టన్నుల,7వందల కేజీల రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు ఎస్సై వీరజనార్దన్ బుధవారం సాయంత్రం తెలిపారు. అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు వెంకటబంగార్రాజు ఇంటిలో తనిఖీ చేసి వెనుకభాగంలో పెద్ద ఎత్తున బియ్యం నిల్వలను గుర్తించినట్లు చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల్లో రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి నిల్వ చేసినట్లు నిందితుడు అంగీకరించిన మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తికి రిమాండ్

మండలంలోని కాటకాపల్లి పంచాయతీ గొల్లపేట గ్రామానికి చెందిన బొబ్బిలి అప్పలనాయుడు అక్రమంగా 40 మద్యం సీసాలు తరలిస్తుండగా పోలీసులకు బుధవారం పట్టుబడ్డాడు. విజయనగరం రోడ్డులో కాటకాపల్లి జంక్షన్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నిందితుడు ద్విచక్ర వాహనంపై 40 మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుపడడంతో కేసు నమోదు చేసి కొత్తవలస మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై వీర జనార్దన్ తెలిపారు.

డబ్బిరాజు పేటలో 1300 కేజీలు బియ్యం పట్టివేత

వేపాడ: మండలంలోని డబ్బిరాజుపేట గ్రామ సమీపంలో 1300 కేజీల పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అక్రమంగా బియ్యం రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు నిర్వహించిన దాడుల్లో డబ్బిరాజుపేట సమీపంలో జంక్షన్ వద్ద బొలెరోలో తరలిస్తున్న 1300 కేజీల పీడీఎస్ బియ్యం పట్టుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ చెప్పారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

వేపాడ: మండలంలోని కరకవలస గ్రామానికి చెందిన శానాపతి ఎర్రయ్యమ్మ (55) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సోంపురం నుంచి కరకవలస గ్రామానికి అల్లుడి ద్విచక్రవామనంపై మంగళవారం వస్తుండగా కళ్లుతిరిగి ఫిట్స్ రావడంతో బైక్‌పై నుంచి ఎర్రయ్యమ్మ కింద పడిపోగా తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో విశాఖలో కేజీహెచ్‌కు కుటుంబసభ్యులు తరలించగా చికిత్స పొందుతూ చనిపోయింది.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ


ఎస్.కోట డిపోలో అరకు తహసీల్దార్‌కు పర్సు అందజేస్తున్న డీఎం కె.రమేష్, తదితరులు

శృంగవరపుకోట: ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీగా వ్యవహరించి ప్రశంసలు అందుకున్నారు. విశాఖ–అరకు సర్వీస్‌కు మంగళవారం డ్రైవర్‌గా విధులు నిర్వహించిన గంగరాజు తన బస్‌లో పడి ఉన్న పర్సును గుర్తించారు. పర్సును భద్రంగా తెచ్చి డిపోమేనేజర్ కె.రమేష్‌కు అందజేశారు. డిపో మేనేజర్ సమక్షంలో పర్సుతెరిచి చూడగా అరకు తహసీల్దార్ వేణుగోపాల్‌కు చెందినదిగా గుర్తించి సమాచారం అందజేశారు. పర్సులో ఉన్న రూ.4,700లు నగదుతో పాటు ప్రభుత్వ గుర్తింపుకార్డులు, ఏటీఎమ్ కార్డును డిపోలో తహసీల్దార్‌కు బుధవారం అందజేశారు. ఆర్టీసీ డ్రైవర్ గంగరాజును తహసీల్దార్‌తో పాటు డిపోమేనేజర్, సహోద్యోగులు అభినందించారు.

సారాతో ముగ్గురి అరెస్టు

బొబ్బిలి: సారా రవాణా చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం తరలించినట్లు ఎస్ఈబీ సీఐ ఆర్ జైభీమ్ తెలిపారు. రామభద్రపురం మండలంలోని జోగిందొర వలస గ్రామానికి చెందిన కురిడి సోములు, ఆదన్న దొర, పెదకాపు చిన్నారావులు సారా తరలిస్తుండగా కాపు కాసి పట్టుకున్నట్లు చెప్పారు. ముగ్గురినీ అరెస్టు చేసి వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని తెలిపారు.

21న వాహనాల వేలం

వివిధ మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలను నెల 21న వేలం వేయనున్నట్టు సీఐ ఆర్‌జైభీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్‌కార్యాలయం ఆవరణలో వేయనున్న వేలం కార్యక్రమంలో ఔత్సాహికులు పాల్గొని వాహనాలను సొంతం చేసుకోవచ్చని పేర్కొన్నారు.

సారా ధ్వంసం


పార్వతీపురం: సారా నిల్వలను ట్రాక్టర్‌తో ధ్వంసం చేస్తున్న సిబ్బంది

పార్వతీపురం: తోటపల్లి ప్రాజెక్టు సమీపంలోని పాతనవిరి కాలనీ దగ్గరలో రూరల్ ఎస్సై వై.సింహాచలం ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం సారా నిల్వలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గతంలో 52 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 2017.3 లీటర్ల సారా, 6 ఎక్సైజ్ కేసులలో స్వాధీనం చేసుకున్న 33.240 లీటర్ల ఎన్‌డీపీ మద్యాన్ని ట్రాక్టర్‌తో ధ్వంసం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న సారా క్యాన్లతో ఎస్ఈబీ సీఐ జైభీమ్ తదితరులు

600 సారా ప్యాకెట్ల పట్టివేత

సాలూరు: ద్విచక్రవాహనంపై సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని 600 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పాచిపెంట ఏఎస్సై సుకరయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ, ఒడిశా నుంచి ద్విచక్రవాహనంపై పాంచాలి వైపు సారా ప్యాకెట్లు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గోగాడవలస సమీపంలో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఘనంగా సైనిక్ స్కూల్ రైజింగ్ డే


కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్, కల్నల్ అరుణ్ ఎం కులకర్ణి, విద్యార్థులు

విజయనగరం రూరల్‌: జిల్లా కేంద్రం సమీప కోరుకొండ సైనిక్ స్కూల్ 61వ రైజింగ్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, కల్నల్ అరుణ్ ఎం. కులకర్ణి మాట్లాడుతూ ఎన్డీఏ ప్రవేశాల్లో దేశంలోని అన్ని సైనిక పాఠశాలల కంటే కోరుకొండ సైనిక్ పాఠశాల ముందు వరుసలో ఉందని తెలిపారు. వివిధ రంగాల్లో పూర్వ విద్యార్థుల పాత్రను గుర్తు చేశారు. సైనిక్ పాఠశాలను ఉన్నతమైన ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులకు అందించిన సేవలను ప్రశంసించారు. సాయుధ దళాలకు సేవ చేస్తూ దేశం కోసం జీవితాలను త్యాగం చేసిన అమరవీరులైన పాఠశాలకు చెందిన విద్యార్థులను స్మరించుకున్నారు. అలాగే పాఠశాల ప్రారంభించడానికి ఈ భూమిని విరాళంగా అందించిన పీవీజీ రాజు సేవా నిరతిని కొనియాడారు. పాఠశాల పూర్వ విద్యార్థులు నెలకొల్పిన ప్రమాణాలు, వారు చేరుకున్న ఉన్నత శిఖరాలను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రత్యేకంగా నిర్వహించిన అసెంబ్లీలో, క్యాడెట్లు బి. గగన్ మనోజ్, కార్తీక్ పూనియా, రూపేష్ రోనంకిలు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు పాఠశాల సాధించిన విజయాల గురించి వివరించారు. చివరగా అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కేక్ కట్ చేసి అభినందనలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.